8న విద్యుత్తు బీసీ ఉద్యోగుల మహాసభ

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 19వ రాష్ట్ర మహాసభను 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు కే కుమారస్వామి ప్రకటనలో తెలిపారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆడిటోరియంలో నిర్వహించనున్న మహాసభలో 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎంపీలు ఈటెల రాజేందర్, ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు వెల్లడించారు.

పల్లెల్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

డీపీవోల సమీక్షలో మంత్రి సీతక్క

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రతి పల్లెనూ ఆదర్శంగా తీర్చిదిద్దాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లిప్తంగా ఉండొద్దని పేర్కొన్నారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని గ్రామీణ మంచినీటి సరఫరా సెంట్రల్ ఆఫీసులో డీపీవోలతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిధుల వినియోగం, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, డైరెక్టర్ శ్రీజన తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సైన్స్ ఎగ్జిబిషన్

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : విద్యార్థుల్లోని సైన్స్ ప్రతిభను వెలికితీసేందుకు, బాలశాస్త్రవేత్తలను గుర్తించేందుకు నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను 7నుంచి 9 వరకు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎస్ స్కూల్‌లో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌కు 830 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయస్థాయికి ఎంపికచేస్తామని తెలిపారు.

ఎస్సీ కాలనీకి తాగునీటి కష్టాలు

- పది నెలలుగా రాని మిషన్ భగీరథ నీళ్లు
- వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్న కాలనీవాసులు
- ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని దళితకాలనీలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

గణపురం, జనవరి 5 : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సొంత మండలమైన గణపురంలోని దళిత కాలనీ ప్రజలు పది నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు రాక గోసపడుతున్నారు. అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడంతో కిలోమీటర్ల దూరం వెళ్లి.. ప్రైవేట్ బోరుబావుల నుంచి బిందెలతో తెచ్చుకొని దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఈ విషయమై దళితకాలనీ మహిళలు సంబంధిత అధికారులకు గోడును విన్నవించుకోగా, ఎస్సీ కాలనీకి పైపులైన్ సమస్య ఉందని, పూర్తి కాగానే నీళ్లిస్తామని నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పది నెలలుగా తాగునీళ్లు లేక వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నామని, స్నానంతోపాటు దుస్తులు శుభ్రం చేసుకోవడానికి సైతం వ్యవసాయ బోర్లపైనే ఆధారపడాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ గోడు విని, దాహార్తిని తీర్చాలని కాలనీప్రజలు వేడుకుంటున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

పది నెలలుగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి భగీరథ నీళ్లు రావడంలేదు. అనేకసార్లు గ్రామపంచాయతీ కార్యదర్శి, మిషన్ భగీరథ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళిత కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించాలి.

- కట్ల ప్రశాంతీశంకరయ్య, మాజీ సర్పంచ్

పర్యాటక పటంలో కోటగుళ్లు, గణపసముద్రానికి చోటు

- టూరిజం శాఖ విడుదల చేసిన వీడియోలో స్థానం
- ప్రపంచవ్యాప్తంగా పర్యాటకశాఖ ప్రచారం

గణపురం, జనవరి 5 : పర్యాటకులను ఆకర్షించేందుకు పర్యాటక శాఖ చిత్రీకరించిన వీడియోలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని కాకతీయులు నిర్మించిన కోటగుళ్లు, గణపసముద్రం సరస్సు మత్తడికి చోటుదక్కింది. పర్యాటక అందాలు, వారసత్వ కట్టడాలుగా పేరొందిన గణపురం కోటగుళ్లు, గణప సముద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి సముచిత స్థానం కల్పించింది. రామప్ప దేవాలయం, భూదాన్ పోచంపల్లి, యాదగిరిగుట్ట, పాండవుల గుట్ట, నాగార్జునసాగర్, జోడేఘాట్‌లోయ, నల్లమల, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కిన్నెరసాని వైల్డ్ లైఫ్ శాంక్చురీ ప్రాజెక్టు, కుమ్రంభీం ప్రాజెక్టు, ఎస్సారెస్పీ (నందిపేట) వంటివి వీడియోలో ఉన్నాయి. సుమారు నిమిషం నిడివి గల వీడియోలో వీటిని పొందుపరిచారు.

డిప్యూటీ సీఎం సభ అట్టర్‌ప్లాఫ్

- భట్టి మాట్లాడకుముందే వెళ్లిపోయిన జనం
- ఖాళీ కుర్చీలతో సభ వెలవెలా
- జనాలను ఆపే ప్రయత్నం చేసిన పోలీసులు

గీసుగొండ, జనవరి 5 : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్లలో నిర్వహించిన సభ అట్టర్ ప్లాఫ్ అయింది. విద్యుత్ ఉపకేంద్రాల శుంకుస్థాపన అనంతరం నిర్వహించిన నియోజకవర్గస్థాయి బహిరంగ సభ జనాలు లేక వెలవెలబోయింది. డిప్యూటీ సీఎం సభను విజయవంతం చేయడానికి నాలుగు రోజులుగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నియోజకవర్గంలోని 6 మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. సభకు ప్రజలను భారీగా తరలించాలని స్థానిక నాయకులకు టార్గెట్లు పెట్టారు. నియోజకవర్గం నుంచి 4వేలమంది సభకు వచ్చి ఉంటారని స్థానిక నాయకులు చెబుతున్నారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే జనాలు వెళ్లిపోవడం మొదలు పెట్టారు. డిప్యూటీ సీఎం ప్రసంగించే సమయంలో ప్రజలంతా వెళ్లిపోయారు. పోలీసులు ప్రజలను ఆపే ప్రయత్నం చేసినా జనం మాత్రం ఆగలేదు. డిప్యూటీ సీఎం మాట్లాడుతుండగానే సభ ప్రాంగణమంతా ఖాళీ అయ్యింది. తన ఎకరం 16 గంటల భూమిని సబ్‌స్టేషన్ కోసం లాక్కున్నారని, మొగిలిచెర్ల గ్రామానికి చెందిన మహిళా రైతు మేడ వరలక్ష్మి డిప్యూటీ సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని బయటకు పంపారు.

ఎల్ఈడీ స్క్రీన్‌లో డిప్యూటీ సీఎం ప్రసంగం, ఎదురుగా కనిపిస్తున్న ఖాళీ కుర్చీలు

కరీంనగర్ జిల్లా రేకుర్తి కంటి దవాఖానలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్

నేత్ర వైద్యశాలకు హైకోర్టు న్యాయమూర్తి విరాళం

విద్యానగర్, జనవరి 5: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రేకుర్తిలోని డాక్టర్ మడేకర్ లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఉదార నేత్ర వైద్యశాలకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఆదివారం దవాఖానను సందర్శించిన ఆయన సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. పేదప్రజల కంటి ఆపరేషన్ల కోసం తన తండ్రి, టైట్స్‌టైల్స్ అండ్ హ్యాండ్లూమ్స్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు పేరిట రూ.లక్ష విరాళంగా అందిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ మలేషియా అసోసియేషన్ అధ్యక్షుడు సైదం తిరుపతి రూ.50 వేల విరాళం అందిస్తున్నట్టు ప్రకటించారు. పేద ప్రజలకు అండగా నిలిచేందుకు ముందుకు వచ్చిన జస్టిస్ వేణుగోపాల్, తిరుపతిని దవాఖాన యాజమాన్యం సత్కరించింది.

ఉచిత కంటి వైద్యశిబిరంలో డ్రైవర్‌కు అద్దాలు అందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి. చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

రోడ్డు ప్రమాదాల నివారణకు చొరవ చూపాలి

- లారీ డ్రైవర్లకు మంత్రి కోమటిరెడ్డి సూచన
- హైవేపై డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

చిట్యాల, జనవరి 5 : జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. జాతీయ రహదారిపై వెళ్లే భారీ వాహన డ్రైవర్ల కోసం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి వద్ద ఉన్న ఓ దాబా వద్ద ఆదివారం ఉచిత కంటి పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ – విజయవాడ రహదారిపై రోజూ 70 నుంచి 80 వేల వాహనాలు తిరుగుతున్నాయని, ఈ రహదారిపై ప్రమాదాలు నివారించేందుకు మొట్టమొదటిసారిగా జిల్లా యంత్రాంగం డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎవరికైనా దృష్టిలోపం ఉంటే ఈ శిబిరంలో పరీక్షలు జరిపి తక్షణమే కళ్లద్దాలు ఇస్తున్నారని తెలిపారు. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా మార్చేందుకు మే నెల చివరి నాటికి టెండర్లు పూర్తి చేసి, రెండు సంవత్సరాల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న లక్షెట్టిపేట కోర్టు జడ్జీ మహ్మద్ అసదుల్లా షరీఫ్

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

జన్నారం, జనవరి 5 : ఉపాధ్యాయ వృతి ఎంతో ఉన్నతమైదని లక్షెట్టిపేట కోర్టు జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. జన్నారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో ఆదివారం నూతన క్యాలెండర్‌ను అ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, మండలాధ్యక్షుడు కట్ట రాజమౌళితో కలిసి విడుదల చేశారు. అనంతరం అయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో నడిమెట్ల విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నగురు సత్యనారాయణ, జనార్దన్, రాజారావు, జాజాల శ్రీనివాస్, నర్సయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

దండేపల్లి, జనవరి 5 : కేజీబీవీ, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ఆవరణలో పీఆర్టీయూటీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు రావణవేణి రవి, మల్యాల మల్లేశ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అప్పాల మనోహర్, వరలక్ష్మి, పాత రమేశ్, కర్నె నరేందర్, కొండు రామన్న, శ్రీనివాస్, లచ్చన్న, తిరుపతి, గంగన్న, ప్రభాకర్, వినోద్, రామరాజు, రమేశ్, కిషన్, నగేశ్, ప్రసాద్ ఉన్నారు.

జెండా పండుగ ఘనంగా జరుపుకోవాలి

ఇందిరానగర్ లో బుర్స పోచయ్య ను సన్మానిస్తున్న ఆదివాసి కోలావార్ నాయకులు

రెబ్బెన, జనవరి 5 : ఆదివాసీ కొలవార్ల 23వ జెండా పండుగను ప్రతి గ్రామంలో ఘనంగా జరుపుకోవాలని ఆ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య పిలుపునిచ్చారు. రెబ్బెన మండలం నక్కలగూడ, ఇందిరానగర్ గ్రామాల్లో ఆదివారం పర్యటించి, గ్రామ, యువజన సంఘాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 8వ తేదీన ప్రతీ గ్రామంలో జెండాలు ఆవిష్కరించి సంస్కృతీసంప్రదాయాలు ప్రతిబింభించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొడిపె వెంకటేశ్, యువజన సంఘం మండలాధ్యక్షుడు దడ్డి విలాస్, మండలాధ్యక్షుడు మైలారపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బుర్స పోచమల్లు, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు బోరె అనిత, దుర్గం తిరుపతమ్మ, గౌరవాధ్యక్షుడు టెకాం భీమయ్య, నాయకులు దుర్గం తిరుపతి, దుర్గం జనయ్య, కమ్మరి మల్లేశ్, ఎర్గటి బాపురావు, మీసాల శ్యాంరావు, అరికెల శంకర్, అరికెల అమృత, మీసాల తార, ఎర్గటి విలాస్, వినోద్ పాల్గొన్నారు.

ఆదివాసుల సంక్షేమమే ధ్యేయం

వాంకిడి, జనవరి 5 : ఆదివాసుల సంక్షేమమే పోలీసుల ప్రధాన ధ్యేయమని వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ పేర్కొన్నారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని చౌన్‌గూడ గ్రామంలో 100 మంది ఆదివాసీ కుటుంబాలకు దుప్పట్లు, 2 క్వింటాళ్ల బియ్యం సిబ్బందితో కలిసి అందజేశారు. ఈ కార్య క్రమంలో పోలీస్ సిబ్బంది, ఆదివాసీ కుటుంబాలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాష్ డ్రైవింగ్‌తో ఇబ్బందులు

బెల్లంపల్లి, జనవరి 5 : బెల్లంపల్లి పట్టణంలో ఆకతాయిల ర్యాష్ డ్రైవింగ్ ప్రవృత్తి రోజురోజుకూ తీవ్రమవుతున్నది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి మహిళలు, యువతులు, బాలికలు నానా అవస్థలు పడుతున్నారు. బజార్ ఏరియా నుంచి మార్కెట్ ఏరియా వరకు ప్రధాన రోడ్డుపై తరుచుగా ఆకతాయిలు అతివేగంతో బైక్‌లను నడిపిస్తున్నారు. సైలెన్సర్స్ లేని బైక్‌లతో అతిగా శబ్దం చేస్తూ రోడ్డుపై వెళ్లేవారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ రోడ్డుపై ఉదయం, సాయంత్రం వేళల్లో అధిక ట్రాఫిక్ ఉంటుంది. ఈ సమయంలోనే అతివేగంతో బైకులతో దూసుకుపోతుండడంతో చిన్నచిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పోస్టాఫీస్ లైన్, డబ్బుసేట్ లైన్, నెల్కో లైన్, కృష్ణమందిర్ లైన్, గాంధీ చౌక్ లైన్‌లో సైతం ఇదే పరిస్థితి ఉండడంతో వాహనచోదకులతో పాటు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మార్కెట్ ఏరియా నుంచి బెల్లంపల్లి బస్తీ మీదుగా పోచమ్మ గడ్డ వరకు కూడా ఇదే పరిస్థితి. ఇక్కడ ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలు ఉండడంతో ఆకతాయిలు విద్యార్థినుల వెనుక వైపు ఒక్కసారిగా హారన్ ఇవ్వడం, బ్రేక్‌లు వేయడం వంటి వెకిలి చేష్టలకు పాల్పడుతున్నారని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. 2వ తేదీన కూడా ఇదే విషయంలో గొడవ జరుగగా, ఆ విషయం పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్లింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలో కూడా ఇలాంటి ర్యాష్ డ్రైవింగ్‌తో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆకతాయిలను గుర్తిస్తున్నాం..

రోడ్లపై బైక్‌లతో ర్యాష్ డ్రైవింగ్ చేసేవారిని గుర్తిస్తున్నాం. ఇప్పటికే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. 30 మందిని గుర్తించాం. బజార్ ఏరియా, బెల్లంపల్లి బస్తీ కళాశాల రోడ్డులో ఎప్పటికప్పుడు పోలీసులతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. ర్యాష్ డ్రైవింగ్ చేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

- దేవయ్య, ఎస్‌హెచ్‌వో, బెల్లంపల్లి వన్‌టౌన్

రాష్ట్ర స్థాయి పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి పోటీలు

కాసిపేట, జనవరి 5 : సోమగూడెం చొప్పరిపల్లి సమీపంలోని త్రినేత్ర ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్ షిప్–2025 పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. డ్రంకెన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కుంగ్‌ఫూ, యూనైటెడ్ డిస్ట్రిక్ట్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ రాష్ట్రస్థాయి ఓపెన్ టూ ఆల్ స్టైల్ పోటీలు చేపట్టారు. ముందుగా ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని చేపట్టి, రిబ్బన్ కట్ చేశారు. ఈ పోటీల్లో అన్ని విభాగాల్లో పోటీదారులు ప్రతిభ చూపారు. టోర్నీ చైర్మన్ దాగం మల్లేశ్, ముఖ్య అతిథులు రత్నం ప్రదీప్, ముత్తె భూమయ్య, సూరం సంపత్, దుర్గం గోపాల్, నిర్వాహకులు కుందెళ్ల రవి, పలువురు మాస్టర్లు పాల్గొన్నారు.

మంచిర్యాలలో 22న సీపీఐ సదస్సు

మాట్లాడుతున్న కలవేన శంకర్

మంచిర్యాల అర్బన్, జనవరి 5 : సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశమంతా శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నదని, ఈ సందర్భంగా మంచిర్యాలలో 22న సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నాయకులు చాడ మహేందర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. స్వాతంత్రోద్యమంలో కమ్యూనిస్టు పార్టీ క్రియాశీలకంగా పాల్గొని, 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో పార్టీ ఆవిర్భవించిందన్నారు. దేశంలో ఎర్రజెండా లేకుండా ఉద్యమం లేదని, ఎర్రజెండా లేని కార్మిక పోరాటం లేదని, ఆ పోరాటాలన్నింటికీ కమ్యూనిస్టు పార్టీ బాసటగా నిలబడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం పూర్ణిమ, మేకల దాస్, జోగుల మల్లయ్య, కారుకూరి నగేశ్, ఖలీందర్ ఆలీఖాన్, మిట్టపల్లి శ్రీనివాస్, లింగం రవి, చిప్ప నర్సయ్య, మండల కార్యదర్శులు, బొంతల లక్ష్మీనారాయణ, సాలిగామ సంతోష్, నెన్నెల సమ్మయ్యపాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుండాలి

జన్నారం, జనవరి 5 : రైతుల సమస్యల పరిష్కారంలో నూతన మార్కెట్ కమిటీ పాలకమండలి సభ్యులు ముందుండాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఆదివారం జరిగిన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ సయ్యద్ ఫసీఉల్లా, డైరెక్టర్లు బీనవేణి రాజన్నయాదవ్, ముత్యం రాజన్న, లావణ్యతో పాటు, ఏడుగురు డైరెక్టర్లతో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సాబుద్దీన్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, మేకల మాణిక్యం, నాయకులు మిక్కినినేని రాజశేఖర్, సయ్యద్‌ఇస్సాక్, శంకర్ పాల్గొన్నారు.

జన్నారం మార్కెట్ యార్డులో మాట్లాడతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కాసిపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఆటగాళ్ల వేలం

పోటాపోటీగా సొంతం చేసుకున్న ఫ్రాంచైజీలు

కాసిపేట, జనవరి 5 : కాసిపేట మండల ప్రీమియర్ లీగ్ సీజన్–3 క్రికెట్ లీగ్‌కు సంబంధించి క్రికెట్ ఆటగాళ్ల వేలం ఆదివారం నిర్వహించారు. మందమర్రి ఎల్లందు క్లబ్‌లో నిర్వహించిన ఈ వేలంలో ఫ్రాంచైజీ నిర్వాహకులు పోటాపోటీగా తమకు నచ్చిన ఆటగాళ్లను సొంతం చేసుకున్నారు. ముంబై హీరోస్, పల్లంగూడ టైటాన్స్, సోల్జర్స్ బ్రేవ్ హార్టెడ్, రాయల్ ఛాలెంజర్స్ ప్లే బోల్డ్, సన్ రైజర్స్, స్మార్ట్ కూల్, పవర్ హిట్టర్స్, గోవా సూపర్ కింగ్స్, సీఎస్‌కే, మాస్టర్స్ బ్లాస్టర్స్ ఫ్రాంచైజీలు ఉన్నాయి. మొత్తం 10 ఫ్రాంచైజీలు పాల్గొనే ఈ లీగ్ జనవరి 19 నుంచి ప్రారంభమవనున్నట్లు తెలిపారు.

వేలంలో పాల్గొన్న ఫ్రాంచైజీ యాజమానులు

కోటపల్లిలో ప్రారంభమైన 108 సేవలు

'108' సేవల పునరుద్ధరణ

- 'నమస్తే'కు స్పందన

కోటపల్లి, జనవరి 5 : '108 కుసుస్తీ' అనే శీర్షిక 'నమస్తే తెలంగాణ' ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. 108 అంబులెన్స్‌లు పనిచేయక కోటపల్లి, భీమిని మండలాల్లో సేవలు నిలిచిపోయాయి. ఈ సమస్యపై డిసెంబర్ 27న ప్రచురించిన వార్తపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, 108 అంబులెన్స్ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడంతో 108 అంబులెన్స్ సేవలు ప్రారంభమయ్యాయి. చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలోని సీహెచ్‌సీలో స్థానిక ఎమ్మెల్యే వివేక్ ప్రారంభించిన అంబులెన్స్‌లు ఖాళీగా ఉన్న విషయాన్ని ప్రచురించగా మంచిర్యాల నుంచి ముగ్గురు 104 అంబులెన్స్ డైవర్లను చెన్నూర్ దవాఖానకు డిప్యూటేషన్‌పై పంపారు. నూతన అంబులెన్స్‌లకు డ్రైవర్లను కేటాయించడంతో రెండు మండలాల్లో అంబులెన్స్ సేవలు ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా 'నమస్తేతెలంగాణ'కు రెండు మండలాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

కడెం నీటి విడుదల

కడెం, జనవరి 5: యాసంగి పంటల కోసం కడెం ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా నీటిని ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అధికారులు, నాయకులతో కలిసి విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 694.650 అడుగులు (6.279టీఎంసీల) నీటి ఉన్నదని ప్రాజెక్టు ఈఈ విఠల్, డీఈ నవీన్ తెలిపారు. ఆయకట్టు కింద నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లోని 17వేల ఎకరాలకు వారబం ధి పద్ధతిన ఏప్రిల్ 17 వరకు నీటిని అందించనున్నట్లు తెలిపారు.

మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కృషి

కాగజ్‌నగర్, జనవరి 5 : మున్నూరుకాపు సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని మున్నూరుకాపు సంఘం భవనంలో ఆదివారం క్యాలెండర్ ఆవిష్కరించారు. సంఘం తాలూకా అధ్యక్షుడు కలికోట రమణయ్య, సంఘం ప్రతినిధులు గజ్జి రామయ్య, సంతోష్, కిషన్ రావు, లక్ష్మణ్, రాంచందర్, రవి, శ్రీనివాస్, జలపతి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి

బెల్లంపల్లి, జనవరి 5 : తెలంగాణ రాష్ట్రం కోసం 1969లో పోరాటం చేసి జైలుకు వెళ్లి శిక్ష అనుభవించిన తొలి దశ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని వారు కోరారు. బెల్లంపల్లిలో ఆదివారం 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమకారులు సమావేశం నిర్వహించారు. ఉద్యమకారులు జంజిరాల రాజం, జాగేటి బాపు మాట్లాడుతూ.. ఉద్యమకారుల కుటుంబానికి ప్రత్యేక రిజర్వేషన్ తీసుకువచ్చి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రం కోసం ఉద్యమించిన ఉద్యకారులకు ఆ ప్రభుత్వం ఇచ్చిన విధంగా పింఛన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జాంగిర్ పాషా, నలిగొండ సత్యనారాయణ, ఈట మల్లేశ్, జెర్రిపోతుల మొగిలి, కేఎం సత్యనారాయణ, తోకల లింగయ్య, రెడ్డి రాజంతో పాటుగా మృతి చెందిన జంగం కేశవులు, కాసర్ల పెద్దలు, నూనెటి కొమురయ్య, దామెర కుమారస్వామి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.